



గంటలకొద్దీ ఫోన్లతో కాలక్షేపం

- లేని సమయపాలన, పెండింగ్‌లో ఫైళ్లు
- ఉద్యోగులు, ఏవోలపై చైర్‌పర్సన్ సీరియస్

6



పోయిన చోటే పొందాలని

గతంలో సీసీఐ విత్తనాల టెండర్ల వ్యవహారంలో కొందరు బయ్యర్లు చేతులు కాల్చుకున్నారు. ఇప్పుడే అదే వ్యక్తులు సీసీఐ కేంద్రాల్లో రైతుల జేబుకు భారీగా చిల్లు పెడుతున్నారు. ఆయా కేంద్రాల్లో అసలు నిబంధనలు ఏమాత్రం అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి.

ఇంత జరుగుతున్నా రైతులు నోరు విప్పని పరిస్థితి నెలకొంది. ప్రశ్నిస్తే.. అసలు పత్తి కొనుగోలు చేయరన్న భయం వారిలో ఉంది. అయితే గుంటూరు నగరంలో ఒక బయ్యర్ విధిస్తున్న కోతను ఓ వ్యక్తి వీడియో రికార్డ్ చేసి మీడియాకు వెల్లడించాడు.

నిలువు దోపిడీ

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతు నిలువు దోపిడీ జరుగుతోంది. సీసీఐ కేంద్రానికి చేరినప్పుడు మొదలైన మామూళ్ల ప్రక్రియ అమ్మే వరకు కొనసాగుతూనే ఉంది. చివరికి పత్తిలో తేమ శాతం చూడటానికి కూడా డబ్బులు ముట్టజెప్పాల్సి వస్తోందంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ఒక పక్క హైకోర్టు కేసులు, మరో పక్క సీఐడీ విచారణ జరుగుతున్నా.. వాటితో సంబంధం లేదన్నట్లుగా కొందరు బయ్యర్లు చేతివాటం చూపిస్తున్నా రు. రోజుకు రూ.లక్షల్లో టార్గెట్‌లు పెట్టుకుని మరీ ముందుకు వెళ్తున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతు జేబుకు చిల్లు



పత్తి తేమ శాతం చూస్తే రూ.5వేలు

- 12శాతం తేమ ఉంటే.. 20కేజీల కోత
- అడ్డుఅదుపు లేకుండా బయ్యర్ల చేతివాటం
- రోజుకు రూ.లక్షల్లో ఆదాయమే ధ్యేయం

తేమ ఎక్కువ ఉంటే.. తూకంలో కోతే

సీసీఐ నిబంధనల ప్రకారం రైతులు తీసుకువచ్చే పత్తిలో తేమ 8 నుంచి 12 శాతం మాత్రమే ఉండాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా పత్తిలో 15 శాతం పైనే ఉంటోంది. ఈ నేపథ్యంలో తేమ 12 శాతం మించిన పత్తిని కూడా కొంటామని కొన్ని కేంద్రాల్లో బయ్యర్లు చెబుతున్నారు. అయితే క్వింటాల్‌కు 10 నుంచి 20 కేజీల వరకు నిర్మొహమాటంగా కోత పెడుతున్నారు.

(సత్తెనపల్లి, ఆంధ్రజ్యోతి)

సాధారణంగా సీసీఐ కేంద్రానికి తీసుకువచ్చిన పత్తికి తేమ శాతం ఎంత ఉందో పరిశీలిస్తారు. అది ముగిసిన తర్వాత కొనుగోలు ప్రక్రియ జరుగుతుంది. పల్నాడు జిల్లా లోని కొన్ని కేంద్రాల్లో తేమ శాతం చూడాలంటే రూ.5 వేలు ఇవ్వాలని ముందే చెబుతున్నారు. ఈ మేరకు రైతు ముందే ఒప్పుకుంటేనే తేమ చూస్తున్నారు. కొందరు ఒప్పుకోకపోవడంతో వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. గుంటూరులోని కేంద్రాల్లో కూడా ఇదే రీతిలో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పక్క జిల్లాల నుంచి వస్తే పండగే..

రైతులు గుంటూరుతోపాటు, పల్నాడు జిల్లాలోని సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకొస్తారు. తీరా ఇక్కడికి వచ్చాక.. పత్తికి బయ్యర్లు అనేక శీల పరీక్షలు చేస్తున్నారు. సుదూరం నుంచి తీసుకొచ్చిన పత్తిని రైతు సాధ్యమైనంత వరకు వెనక్కి తీసుకెళ్లలేడు కనుక.. చెప్పినంత కోతకు ఒప్పుకుంటే సరేసరి.. లేకుంటే వెనక్కి తీసుకెళ్లాల్సిందే అని తెగేసి చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం, ఏలూరు, కృష్ణా జిల్లా గంపలగూడెం, జగ్గయ్యపేట తదితర ప్రాంతాల నుంచి గుంటూరులోని సీసీఐ కేంద్రాలకే పత్తిని (మిగతా 8వ పేజీలో)



విద్యార్థినులతో మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ

ఫిర్యాదులకు ఆన్‌లైన్ పోర్టల్

- పోష్ చట్టంపై ఐసీసీ కమిటీలకు అవగాహన
- అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ
- బాపట్లలో బాలికాసదన్, వన్‌స్టాప్ సెంటర్ సందర్శన

6

సైనిక కుటుంబాల సంక్షేమం మన బాధ్యత

నరసరావుపేట రూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో అసువులు బాసిన సైనిక కుటుంబాల సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కలెక్టర్ కృతికాశుక్లా అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం సాయుధ దళాల పతాక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ ఏడాది ఆ తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశ రక్షణలో అసువులు బాసిన వీర జవానులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం.. ఈ పతాక దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పతాక దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు విరివిగా విరాళాలు అందించాలని కోరారు. విరాళాలు అందించాల్సిన వివరాలు డైరెక్టర్ సైనిక సంక్షేమ శాఖ మధు గార్డెన్స్, విజయవాడ (168 57), ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా నంబరు 33881128795, ఐఎఫ్‌సీఐ కోడ్ ఎస్‌బీఐఎన్ 0016857 కు పంపాలని తెలిపారు. ఈ విరాళాలకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు అందించడం జరుగుతుందని తెలిపారు.



విద్యార్థులతో కలెక్టర్ కృతికా శుక్లా

బ్యాంకింగ్ సేవల సహకారం అందించాలి

శావల్యాపురం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కొన్ని సహకార సంఘాల్లో బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంతో నగదు లావాదేవీలు నిర్వహించడం రైతులకు కష్టతరంగా మారింది. సహకార సంఘాల్లో బ్యాంకింగ్ సేవలు కూడా అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్నారు. కానీ, ఆ దిశగా అడుగులు పడడం లేదు. శావల్యాపురం సొసైటీ కార్యాలయ ఆవరణలో జీడీసీసీ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసేందుకు 2020లోనే అధికారులు ప్రణాళికలు రూపొందించారు. భవనం అందుబాటులో ఉంటే బ్రాంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో సొసైటీ నిధులు రూ.45 లక్షలు వెచ్చించి 2021లో భవన నిర్మాణాన్ని కూడా పూర్తి చేశారు. అంతలో బ్రాంచ్‌ల ఏర్పాటు విషయంలో ఆర్‌బీఐ నిబంధనల్లో కొన్ని మార్పులు చేయడంతో అనుమతులు నిలిచిపోయాయి. దాంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది.

శావల్యాపురం సొసైటీలో రుణాలు పొందిన రైతులు వినుకొండలోని జీడీసీసీ బ్యాంక్‌కు వెళ్లి నగదు తీసుకుంటున్నారు. రైతులు రుణాలను సొసైటీ కార్యాలయంలో చెల్లించే వెసులుబాటు కల్పించినప్పటికీ.. సిబ్బంది నగదును వినుకొండ బ్యాంక్‌లో జమ చేయాల్సి వస్తుంది. ప్రతిరోజూ రైతులు చెల్లించిన నగదు వినుకొండకు వెళ్లి బ్యాంక్‌లో జమచేయడం సిబ్బందికి కష్టతరంగా మారింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సొసైటీ ద్వారా రూ.56 కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. 2025-26లో రూ.16కోట్ల మేర లావాదేవాలు నిర్వహించారు. ఇంత పెద్ద మొత్తంలో లావాదేవీలు జరుగుతున్నప్పటికీ బ్యాంక్ అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీ సేవల్లో పారదర్శకతను పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని తెచ్చి- సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోంది. డ్వాక్రా సంఘాలకు కూడా భారీ ఎత్తున రుణాలు అందజేస్తున్నారు. ఇటీవల శావల్యాపురం సొసైటీ కార్యాలయానికొచ్చిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావును శావల్యాపురంలో జీడీసీసీ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం, సీఈవో నాగప్రసాద్, రైతులు కోరగా సానుకూలంగా స్పందించారు. త్వరలో బ్రాంచ్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ నిచ్చారు.



శావల్యాపురంలోని సొసైటీ కార్యాలయం

హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

నరసరావుపేట లీగల్, డిసెంబరు 6, (ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని లింగంగుంట్ల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 63వ హోంగార్డ్ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ కృష్ణారావు హోంగార్డుల కవాతు ప్రదర్శనను వీక్షించారు. గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ కమాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవాతు ప్రదర్శనను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్పీ విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఏఎస్పీలు సంతోష్, సత్తిరాజు, లక్ష్మీపతి, డీఎస్పీలు హనుమంతరావు, గాంధీరెడ్డి, కృష్ణ, యువరాజ్, సీఐలు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

పాలకుల్లేని.. పురాలకు మొండి చేయి

- ఆర్థిక సంఘం నిధులు నిలిపివేత
- ఎన్నికలు నిర్వహించని ఫలితం



నరసరావుపేట పురపాలక సంఘ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం పలు మునిసిపాలిటీలకు మొండిచేయి చూపింది. ఎన్నికలు నిర్వహిం చని ఫలితం.. 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిపివేసింది. నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పెద్ద ఎత్తున నిధులు కోల్పోయాయి. దీంతో ఆయా పురపాలక సంఘాల్లో ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. అయితే గుంటూరు కార్పొ రేషన్, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని ఇతర మునిసిపాలిటీలకు 2025-26 సంవత్సరానికి గాను కేంద్రం నుంచి విడుదలైన రెండో విడత నిధులు రూ.52.15 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మునిసిపాలిటీల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

విలీన సమస్య..

జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం పురపాలక సంఘాలకు విడుదల చేస్తుంది. ఈ నిధుల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తారు. ఎన్నికలు నిర్వహించని ఫలితంగా నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు మున్సిపాలిటీలతో పాటు మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థకు మొండి చేయి తప్పలేదు.

ఈ పురాలకు పొరుగున ఉన్న పంచాయతీలను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. గత ప్రభుత్వంలో అధికారులపై ఒత్తిడి తెచ్చిన వైసీపీ నేతలు వారికి అనుకూలంగా వార్డుల పునర్విభజన చేయించారు. అభ్యంతరాలు వచ్చినా.. అధికారులూ లక్ష్య పెట్టలేదు. దీంతో వార్డుల పునర్విభజన సక్రమంగా జరగలేదని బాధితులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో నరసరావుపేట, పొన్నూరు, బాపట్ల మునిసిపాల్టీల ఎన్నికలు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం (మిగతా 8వ పేజీలో)

నిధులు విడుదల ఇలా..

మునిసిపాల్టీ	విడుదలైన నిధులు
గుంటూరు	25,70,27,485
తెనాలి	5,57,23,074
చిలకలూరిపేట	5,01,92,840
రేపల్లె	1,77,02,759
మాచర్ల	2,17,82,665
సత్తెనపల్లి	2,06,02,250
పిడుగురాళ్ల	2,35,71,377
అద్దంకి	1,58,56,212
చీరాల	2,98,80,252
దాచేపల్లి	1,71,48,906
గురజాల	1,25,05,961

అక్రమంగా చేపల పెంపకం

- ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు

ముప్పాళ్ళ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దమ్మాలపాడు, లంకెలకూరపాడు గ్రామాల్లోని ఊరచెరువులో అనధికారికంగా చేపలు పెంచుతున్నారు. దీంతో గ్రామ పంచాయతీ లక్షల రూపాయల ఆదాయం కోల్పోతోంది. ఈ చెరువకు వేలం నిర్వహించకుండా..ఓ నాయకుడికి రూ.1.50 లక్షలు ఇచ్చేందుకు.. చేపల పెంపకం దారుడు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. మండలంలోని మరో రెండు పంచాయతీల పరిధిలోని చెరు వులకు కూడా బహింగ వేలం నిర్వహించ కుం డా.. పాత పాట దారునికే చెరువులను అప్పగించి నట్లు సమాచారం. దీనికిగాను పెద్ద ఎత్తున ము డుపులు చేతులు మారినట్లు సమాచారం. ఈ విషయమై దమ్మాలపాడు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శివపార్వతిని వివరణ కోరగా.. దమ్మా లపాడు చెరువులో చేపలు పెంచడం లేదన్నారు. లంకెలకూరపాడు పంచాయతీ కార్యదర్శి రమేష్ ను వివరణ కోరగా చేపలు పెంచుతున్న విషయం తన దృష్టికి రాలేదన్నారు.



తిను బండారం బయట పడేనా!

- పశువుల కొవ్వుతో నూనె తయారీ..?
- ఆహార పదార్థాల్లో వాడకంపై అధికారుల ఆరా

పిడుగురాళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో పశువుల కొవ్వుతో గుట్టుగా నూనె తయారు చేస్తున్నారు. ఇటీవల పిడుగురాళ్ల సమీప ప్రాంతాల్లో ఒకటి రెండుచోట్ల పశువుల కొవ్వుతో నూనె తయారవుతున్నట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తమ తనిఖీల్లో పసిగట్టారు. తయారీ, రవాణా తదితర అంశాలతో పాటు ఆహార పదార్థాల్లో ఎంత శాతం మేర నూనె వాడుతున్నారనే దానిపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల బృందం పట్టణంలో తరచూ పర్యటిస్తూ.. ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరిస్తోంది. సాధారణంగా ఒకసారి వాడిన నూనెనే మళ్లీ వాడితే పేగు పూతతో పాటు పలు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా కిడ్నీ, లివర్‌పై అత్యంత ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఇక పశువుల కొవ్వుతో తయారైన నూనెను వాడితే ఒక్కోసారి ప్రాణాపాయ పరిస్థితి కూడా రావొచ్చు.

ఆరా తీస్తున్నారు..

పిడుగురాళ్ల, పరిసర ప్రాంతాల్లో పశువుల కొవ్వుతో నూనె తయారీ కేంద్రాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు అన్వేషిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం బ్రాహ్మణపల్లిలోనూ ఇటువంటి ఘటనలే వెలుగులోకి వచ్చాయి. పట్టణంలోని తోపుడు బండ్లు, జానపాడు రోడ్డు, మాచర్ల బస్టాండ్ సెంటర్‌లోని బండ్లపై విక్రయిస్తున్న ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి, వాటిల్లో ఎంతమేర కొవ్వుతో తయారైన నూనె వాడుతున్నారో గుర్తించే పనిలో ఉన్నామని ఓ అధికారి వెల్లడించారు.



కొత్తపాలెం పాఠశాలలో నిరుపయోగంగా టైల్స్



ప్రభుత్వ పాఠశాల గదిలో సిమెంటు బస్తాలు



నిరుపయోగంగా గ్రానైట్ రాళ్లు

అధనం.. నిరుపయోగం

వినుకొండటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం తెచ్చిన మెటీరియల్ నిరుపయో గంగా మారింది. గత ప్రభుత్వంలో నాడు- నేడు కింద ప్రభుత్వ పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. ఇందుకు ప్రభుత్వం ఉచితంగా సిమెంటు, ఇసుక సరఫరా చేసింది. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసి భవనాలను అప్పగించాల్సి ఉంది. అయితే.. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు సక్రమంగా అందక పోవడంతో కాంట్రా క్టర్లు పనులు నిలిపేశారు. దీంతో మండలంలోని కొత్తపాలెం జడ్పీ, నాగులవరం ప్రభుత్వ పాఠశాలతో పాటు పట్టణంలోని ఓ పాఠశాలలో నిల్వ ఉన్న వందల కొలది సిమెంటు బస్తాలు పనికిరాకుండా పోయాయి. అలాగే కొత్తపాలెం పాఠశాల పనులు సక్రమంగా నిర్వహించకపో వడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఆవరణలో టైల్స్, గ్రానైట్ రాళ్ల నిరుపయోగంగా పడిఉన్నాయి. ఇప్పటికైనా ఈ నిర్మాణ మెటీరియల్‌ను వినియోగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సుందరంగా రూపుదిద్దుకున్న ఎన్టీఆర్ పార్కు

నీటి పథకం..సుందర వనం

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గ పరిధి లోని లేమల్లె గ్రామంలో పంచాయతీకి చెందిన వాటర్ స్కీం ప్రాంగణం సుందర వనంగా రూపుదిద్దుకుంది. పిచ్చిమొక్కలతో అడవిని తలపించిన ఈ ప్రాంతం.. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో పార్క్‌గా మారింది. అమరావతి - గుంటూరు రహదారి వెంబడి ఉన్న నీటి పథకం పంప్‌హౌస్, ఓవర్‌హెడ్ ట్యాం క్, సంప్ అడవిని తలపించడంతో.. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు గ్రా మానికి వచ్చిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టిలో పడింది. ఆయన ఆదేశాలతో.. సర్పంచ్ ఉగ్గం పున్నమ్మ, కార్యదర్శి బి.రమేష్ పిచ్చిమొక్కలు తొల గించి. రూ 5 లక్షల ఖర్చుతో సుందరమైన పార్క్‌ను తయారు చేయించారు. ఇసుకతో వాకింగ్ ట్రాక్, ఆహ్లాదాన్ని కలిగించేలా చెట్లకు రంగులు వేసి.. సంప్‌పై జంతువులు, పక్షుల బొమ్మలు తీర్చిదిద్దారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు క్రీడా సామగ్రి, పూ లమొక్కలు, లైటింగ్, మైకు అందుబాటులో ఉంచారు. దీనికి ఎన్టీఆర్ పార్కుగా నామకరణం చేశారు. ఎమ్మెల్యే ప్రవీణ్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేశారు.



తీర్చిదిద్దిన వాటర్ సంప్

కాల్వలో పడి మహిళ, పసికందు మృతి



చిన్నారి శరత్, తల్లి త్రివేణి (ఫైల్‌ఫొటోలు)

నరసరావుపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాల్వలో పడి ఓ మహిళ ఆమె ఏడు నెలల పసికందు మృతి చెందిన ఘటన నరసరావుపేట మండలం పాలపాడు వద్ద శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, నాదెండ్ల మండల కేంద్రానికి చెందిన త్రివేణికి (26) మూడు సంవత్సరాల క్రితం రొంపిచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌తో వివాహమయింది. త్రివేణి దంపతులకు ఏడునెలల క్రితం మగబిడ్డ పుట్టాడు. కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆసుపత్రిలో చూపించేందుకు శ్రీకాంత్ భార్యతో కలసి నరసరావుపేటకు వచ్చాడు. ఆసుపత్రిలో చూపించుకొని తిరిగి గ్రామానికి వెళ్తున్న క్రమంలో నరసరావుపేట మండలం పాలపాడు వద్ద చిలకలూరిపేట మేజరులో ప్రమాదవశాత్తూ పడి భార్య త్రివేణి, కుమారుడు గల్లంతయ్యారని శ్రీకాంత్ పోలీసులకు తెలిపాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని త్రివేణి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తన కుమార్తెను అల్లుడే చంపాడని మృతురాలి తల్లి ఆరోపిస్తోంది. శ్రీకాంత్‌కు త్రివేణికి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయని, ఈ క్రమంలోనే భార్య, కుమారుడిని కడతేర్చి ప్రమాదంగా చిత్రీకరిస్తున్నాడని ఆమె పేర్కొంది. ఈ నేపథ్యంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యశాల వద్ద ఆందోళన

● తన కూతురిని, మనవడిని అల్లుడే కడతేర్చాడని ఆరోపిస్తూ తల్లి ఎల్లమ్మ నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల ముందు రోడ్డుపై బంధువులతో కలిసి బైఠాయించి ఆందోళన తెలిపింది. పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 578.40 అడుగులు ఉంది. ఇది 278.39 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,492 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 50,659 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 50,659 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 43.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1109 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా మూడు వేల క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 3400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

గంటలకొద్దీ ఫోన్లతో కాలక్షేపం

● లేని సమయపాలన, పెండింగ్‌లో ఫైళ్లు ● జడ్పీ ఉద్యోగులు, ఏవోలపై చైర్‌పర్సన్ క్రిస్టినా ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా ఉద్యోగులను తీవ్రంగా హెచ్చరించారు. పనితీరు సరిచేసుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఫైళ్లు నెలలపాటు పెండింగ్‌లో ఉండటం దేనికి సంకేతం అంటూ నిలదీశారు. శనివారం సమావేశ మందిరంలో జరిగిన జిల్లా పరిషత్ ఉద్యోగుల సమావేశంలో చైర్ పర్సన్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఏవోలకు అసలు సమయపాలన పాటించడం లేదని, వాళ్లు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియటం లేదని అన్నారు. ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలవాల్సిన ఏవోలే అలా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. ఇక మీదట కచ్చితంగా సమయపాలన పాటించాల్సిందేనని ఆదేశించారు. ఫైళ్లు నెలలు తరబడి పెండింగ్ ఎందుకు పెడుతున్నారని జడ్పీ ఉద్యోగులను ప్రశ్నించారు. కొందరు ఉద్యోగులు గంటల తరబడి ఫోన్లు చూస్తున్నారని, అంతసేపు ఫోన్లు చూస్తే ఇక పనేమి చేస్తారని ఫైర్ అయ్యారు. ప్రతి ఫైలు మూడు రోజుల్లో క్లియర్ కావాలని స్పష్టం చేశారు.

● చైర్‌పర్సన్ ఆగ్రహానికి కారణం ఇదే..!

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే జడ్పీ చైర్‌పర్సన్ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేయడానికి కారణం లేకపోలేదు. సీఈవో, డిప్యూటీ సీఈవో ఎక్కువగా సీఎం ప్రోగ్రాంలు, గ్రీవెన్స్‌తో పాటు క్షేత్రస్థాయిలో వివిధ పనుల నిమిత్తం క్యాంపులకు వెళ్తుంటారు. అటువంటి పరిస్థితిలో చాలా సందర్భాల్లో కొంత మంది అధికారులు, ఉద్యోగులు ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయానికి రావటం, పోవటం చేస్తుంటారని సమాచారం. దాంతో ఎక్కువ ఫైళ్లు రోజుల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఫైళ్లు సకాలంలో క్లియర్ చేయకుండా నెపాన్ని చైర్ పర్సన్, సీఈవో, డిప్యూటీ సీఈవో మీద నెట్టటం ఆనవాయితీగా మారినట్లు తెలిసింది. ఇటువంటి పరిస్థితిల్లో జిల్లా పరిషత్ సమావేశంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే చైర్‌పర్సన్ ఉద్యోగులను సమావేశంలో హెచ్చరించారు.

● 18 మందికి పదోన్నతులు...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 18 మంది ఆఫీస్ సబార్డినేట్లకు రికార్డ్ అసిస్టెంట్‌లుగా, ల్యాబ్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈవో వీర్ల జ్యోతి బసు ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీవో పిచ్చి రెడ్డి, ఏవో శామ్యూల్ పాల్, అన్ని సెక్షన్‌ల ఏవోలు పాల్గొన్నారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

14 కాదు 7 శాతం ఓఎస్‌సీ వసూలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనధికార భవనాల క్రమబద్ధీకరణకు ఏడు శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించాలని నగరపాలకసంస్థ సిటీప్లానర్ రాంబాబు తెలిపారు. ఎల్ఆర్ఎస్ జీవోలో పొందుపరిచిన మేరకు చార్జీలు చెల్లించాలన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'బీపీఎస్‌కు వెనకడుగు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. అధికారిక లేఅవుట్లలో నిర్మించిన భవనాలను బీపీఎస్ కింద రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత పీనల్ చార్జీలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. అనధికార లేఅవుట్లలో నిర్మించిన వాటికి మాత్రం పీనల్ చార్జీలకు అదనంగా ఏడు శాతం ఓఎస్‌సీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. డాక్యుమెంట్‌లో ఎంత మార్కెట్ విలువ ఉందో దానికి ఏడు శాతం ఓఎస్‌సీ చెల్లించాలన్నారు. ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు లైసెన్స్‌డ్ ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భవన యజమానులు రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన బీపీఎస్-2025ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, తొలుత ఇచ్చిన ఉత్తర్వులలో జీవో నంబరు 10ని అనుసరించాలని స్పష్టంగా పేర్కొన్నారు. దాని ప్రకారం అయితే 14 శాతం ఓఎస్‌సీ చెల్లించాలి. అయితే కొన్ని రోజుల తర్వాత జీవో నంబరు 10ని కాకుండా ఎల్ఆర్ఎస్ జీవోను పాటించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై లైసెన్స్‌డ్ ఇంజనీర్లకు తగిన అవగాహన లేకపోవడం కూడా గందరగోళానికి దారి తీస్తోంది.

నేడు చర్లపల్లి, చెన్నై ఎగ్మోర్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆదివారం గుంటూరు మీదుగా చర్లపల్లికి ప్రత్యేక రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 06019 చెన్నై ఎగ్మోర్-చర్లపల్లి ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం 7.05కి గుంటూరుకు వచ్చి 7.15కి బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు చర్లపల్లి చేరుకొంటుందని చెప్పారు. రైలు నంబరు 06020 చర్లపల్లి-చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ స్పెషల్ ఆదివారం రాత్రి 11 గంటలకు గుంటూరుకు వచ్చి 11.10కి బయలుదేరి సోమవారం ఉదయం 8.30కి చెన్నై ఎగ్మోర్‌కు చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు.

వీవీఐటీ విద్యార్థులకు కొలువులు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

పెదకాకాని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీవీఐటీయూ) విద్యార్థులు 59 మంది రాజ్‌కోట్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ప్రముఖ బహుళజాతీయ సంస్థ "జ్యోతి సీఎన్ సీ ఆటోమేషన్ ప్రైవేట్ లిమిటెడ్"లో ఉద్యోగాలు పొందారని చాన్సలర్ ప్రొఫెసర్ వాసిరెడ్డి మహదేవ్ శనివారం తెలిపారు. కోర్ బ్రాంచిలకు చెందిన మెకానికల్ విద్యార్థులు 35 మంది, ఈఈఈ విభాగానికి చెందిన 24 మంది ఈ నియామకాలు సాధించారని ఆయన చెప్పారు. వారికి శిక్షణ సమయంలో 3.6 లక్షల వార్షిక వేతనం ఉంటుందని తెలిపారు.. 2025-2026 విద్యా సంవత్సరానికి చెందిన మెకానికల్ విద్యార్థులు 67 మంది ఈఈఈ విద్యార్థులు 75 మంది వివిధ బహుళజాతీయ సంస్థలలో ఉద్యోగాలు పొందారని తెలిపారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ వై. మల్లికార్జునరెడ్డి, ప్లేస్మెంట్ డైరెక్టర్ ఏ.వెంకటేష్, ప్లేస్మెంట్ బృందం అభినందించారు.

రేపటి నుంచి యువజనోత్సవం

● సంగీత దర్శకుడు తమన్ రాక



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సమన్వయకర్త మురళీమోహన్

ఏఎన్‌యూ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల యువజనోత్సవం ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరుగుతుందని యువజనోత్సవం సమన్వయకర్త ఆచార్య ఎస్. మురళీమోహన్ వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యువజనోత్సవానికి కళాశాలల విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. ఈ పోటీలకు సుమారు 700 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని మురళీమోహన్ పేర్కొన్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్ మాట్లాడుతూ, ఈనెల 8న యువజనోత్సవం ప్రారంభం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, ప్రత్యేక గౌరవ అతిథిగా ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు ఎస్ఎస్ తమన్, ప్రత్యేక అతిథులుగా రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్,రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, గౌరవ అతిథులుగా ఓఎస్డీ రవికుమార్, పాలకమండలి సభ్యుడు ఆచార్యులు సుమంత్ కుమార్, జగదీష్ నాయక్, క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్యులు సురేష్ కుమార్, వీరయ్య, పాల్ కుమార్ తేజోమూర్తి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం

● ఎమ్మెల్సీ ఆలపాటి



అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

చుండూరు, డిసెంబరు 06 (ఆంధ్ర జ్యోతి): క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి తోడ్పడతాయని, వాటి ద్వారా అందే క్రమశిక్షణతో జీవిత గమ్యాలను చేరుకోవచ్చని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మోదుకూరు శ్రీవేమన జిల్లా పరిషత్ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 69వ అంతర్ జిల్లాల బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. తెనాలి డివిజన్‌లోని వివిధ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేసిన దివంగత అన్నపరెడ్డి చింపారెడ్డి భార్య అన్నపూర్ణమ్మను ఈ సందర్భంగా ఆలపాటి ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుండి వచ్చిన అండర్-19 సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు అభినందించి క్రీడా పోటీలను ప్రారంభించారు. తొలిరోజు జరిగిన పోటీలలో విశాఖపై అనంతపురం జిల్లా జట్టు, వైఎస్ఆర్ కడపపై శ్రీకాకుళం, తూర్పుగోదావరిపై విజయనగరం జట్టు, నెల్లూరుపై కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో విజయనగరం, కృష్ణ, గుంటూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. ప్రారంభ కార్యక్రమంలో ఆర్‌జేడీ పద్మ, ఆర్ఐవో సునీత, టీడీపీ మండల అధ్యక్షులు తమ్మా శివారెడ్డి, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు (బుజ్జి), హెచ్ఎం వెంకటేశ్వరరావు, అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ రిఫరీ అన్నపరెడ్డి జగదీశ్వరరెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి నరసింహారావు, జిల్లా పిడి అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకరరెడ్డి, టోర్నమెంట్ ఇన్‌చార్జిలు జయరాజ్, చంద్రశేఖర్‌రాజు, విద్యాధికారి సాల్మన్, వివిధ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్స్ విభాగంలో విజేత హైదరాబాద్ ఎడ్లజత



ప్రథమస్థానం సాధించిన హైదరాబాద్ ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్లబండలాగుడు పోటీల్లో శనివారం జూనియర్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన మేకా ప్రతీక్, రామకృష్ణ ఎడ్లజత విజయం సాధించింది. నిర్ణీత సమయంలో బండను 2,750 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం సాధించింది. గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లజత 2 వేల అడుగులతో రెండో స్థానం, గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన నల్లమోతు వీరశంకరరావు ఎడ్లజత 1,934 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా పమిడిమర్రుకు చెందిన యర్రసాని సుబ్బయ్య ఎడ్లజత 1,845 అడుగులతో నాలుగోస్థానం సాధించాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత 1,766 అడుగులతో ఐదోస్థానం, బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన సుఖవాసి సతీష్‌బాబు ఎడ్లజత 1300 అడుగులతో ఆరోస్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్లజతల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

క్రోసూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని ఊటుకూరు గ్రామం వద్ద జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన గొర్రెపాటి చందు (21) అతని స్నేహితుడు బుల్లిబాబు ద్విచక్ర వాహనంపై అచ్చంపేట మండలం కస్తల గ్రామం నుంచి వస్తున్న క్రమంలో ఊటుకూరు మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో చందు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించగా మరో యువకుడు బుల్లిబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

TMB తమిళనాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్

వినుకొండ బ్రాంచ్, 23-194, 1వ అంతస్తు, పల్నాడు రోడ్, వినుకొండ, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522647, ఫోన్ : 08646-273063, 9177285567. Email ID : vinukonda@tmbank.in, CIN : L65110TN1921PLC001908

స్వాధీనతా ప్రకటన

{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 8(1)}

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 **తమిళ్‌నాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్, వినుకొండ బ్రాంచ్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు సదరు చట్టంలోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (54 ఆఫ్ 2002) నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీత/ తనఖాదారులు/ హామీదారులు/యజమాని : 1) మెస్సర్స్ కీర్తి గ్రానైట్స్ తరఫున యజమాని : శ్రీ బత్తుల శ్రీనివాస రెడ్డి**, గ్రౌండ్ ఫ్లోర్, డి.నెం.278/8, 347 మరియు 414, కోటప్పకొండ, గురవయ్యపాలెం గ్రామము కుగ్రామమైన యల్లమంద గ్రామము, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా, **2) శ్రీ బత్తుల శ్రీనివాస రెడ్డి, తండ్రి : సాంబిరెడ్డి**, నివాసము డోరు నెం.12-3-36/2ఎ, డియస్‌పి బంగ్లా వెనుక వైపు, రెవిన్యూ వార్డు నెం.10, శ్రీరామపురం, నరసరావుపేట టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా మరియు **3) శ్రీమతి బత్తుల స్వప్న, భర్త : శ్రీనివాస రెడ్డి**, డోరు నెం.12-3-36/2ఎ, డియస్‌పి బంగ్లా వెనుక వైపు, రెవిన్యూ వార్డు నెం.10, శ్రీరామపురం, నరసరావుపేట టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా వారు నోటీసులో తెలిపిన బకాయి సొమ్ము **ది.12-09-2025 నాటికి రూ.1,37,62,007.25 పై॥ (అక్షరాల ఒక్క కోటి ముప్పై ఏడు లక్షల అరవై రెండు వేల ఏడు రూపాయలు మరియు ఇరవైఐదు పైసలు మాత్రము)** నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.22-09-2025** న డిమాండు నోటీసు జారీ చేయడమైనది.

బకాయిసొమ్ము చెల్లించడంలో **ఋణగ్రహీత/ హామీదారులు/తనఖాదారులు** విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4)తో అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు (8) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారుడు దిగువ పేర్కొన్న ఆస్తిని **ది.05-12-2025న స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత/ హామీదారులు/ తనఖాదారులకు** మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా నోటీసు ఇచ్చి తెలియజేయడమైనది.

సదరు చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్ (8) ప్రకారం **ఋణగ్రహీత/ హామీదారులు/తనఖాదారులు** తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా **ది.30-11-2025 నాటికి రూ.1,42,06,258.83 పై॥ (అక్షరాల ఒక్క కోటి నలభైరెండు లక్షల ఆరు వేల రెండు వందల యాభైఎనిమిది రూపాయలు మరియు ఎనభైమూడు పైసలు మాత్రము)(టర్మ్ లోన్ కొరకు రూ. 89,53,548.33/- మరియు ఓవర్ డ్రాఫ్ట్ కొరకు రూ. 52,46,929/-)** మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు వసూలు తగ్గించుకొని **తమిళ్‌నాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్, వినుకొండ బ్రాంచ్** వారి ఛార్జికి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా **ఋణగ్రహీత, హామీదారులు, తనఖాదారులను** మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమైనది.

స్థిరాస్తుల యొక్క వివరములు

ఆస్తి నెం.1 : పల్నాడు జిల్లా (పూర్వం గుంటూరు జిల్లా), నరసరావుపేట మండలం, గురవయ్యపాలెం గ్రామ పంచాయతీ, యల్లమంద శివారు, యస్.నెం.278/8, 347, 414, 278/8 లో **శ్రీ బత్తుల శ్రీనివాస రెడ్డి, తండ్రి : సాంబిరెడ్డికి చెందిన** ఎ.1.48 సెంట్ల విస్తీర్ణముగల ఇండస్ట్రియల్ స్థలము మరియు అందులోని ఆర్‌సిసి బిల్డింగ్ మరియు గ్రానైట్ ఫ్యాక్టరీ బిల్డింగ్ అందులో 8939.49 చ॥అ॥ల (ప్లాన్ మరియు కొలతల ప్రకారం) విస్తీర్ణములో నిర్మించిన కటింగ్ మరియు పాలిషింగ్ యూనిట్‌కు సంబంధించిన యావదాస్తి.

ఐటమ్ నెం.1 : గురవయ్యపాలెం గ్రామము కుగ్రామమైన యల్లమంద గ్రామము, డి.నెం.278/8, 347 మరియు 414 లోని ఎ.0.38 సెంట్లు లేదా 1839.2 చ॥గ॥లు లేదా 1537.57 చ॥మీ॥ల విస్తీర్ణమునకు హద్దులు : తూర్పు : ఐటమ్ నెం.2 స్థలము, **దక్షిణం :** అబ్రహం లింకన్‌కు చెందిన స్థలము, **పడమర :** దొనేపూడి రోడ్, **ఉత్తరం :** ఏమి హద్దు లేదు(శూన్యం).

ఐటమ్ నెం.2 : గురవయ్యపాలెం గ్రామము కుగ్రామమైన యల్లమంద గ్రామము, డి.నెం.278/8 లోని ఎ.1.10 సెంట్లు లేదా 5324 చ॥గ॥లు లేదా 4450.86 చ॥మీ॥ల విస్తీర్ణమునకు హద్దులు : తూర్పు : ఫారెస్ట్ భూమి, **దక్షిణం :** అబ్రహం లింకన్‌కు చెందిన భూమి, **పడమర :** ఐటమ్ నెం.1 స్థలము, **ఉత్తరం :** పురుషోత్తపట్నంకు చెందిన భూమి.

ఆస్తి నెం.2 : పల్నాడు జిల్లా, నాదెండ్ల మండలం, గొరిజవోలు గ్రామము లోని **శ్రీ బత్తుల శ్రీనివాస రెడ్డి, తండ్రి : సాంబిరెడ్డికి చెందిన** ఎ.1.67 సెంట్ల విస్తీర్ణములోని నెం.32-బి1 కు చెందిన ఎ.0.48 సెంట్ల విస్తీర్ణము మరియు 32-బి3బి కి చెందిన ఎ.1.19 సెంట్ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీభూమికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** శ్రీ బత్తుల శ్రీనివాసరెడ్డి మిగిలిన భూమి (తనఖాదారు యొక్క భూమి), **దక్షిణం :** రోడ్డు, **పడమర :** రామతులసమ్మ భూమి, **ఉత్తరం :** రోడ్డు.

(గమనిక : పైన పేర్కొనబడిన టర్మ్ లోన్ కోసం ప్రాథమిక సెక్యూరిటీ మరియు ఒడి కోసం కొలేటరల్ సెక్యూరిటీ టర్మ్ లోన్ కోసం సాధారణ పూచీకత్తు శ్రీమతి బత్తుల స్వప్న, భర్త : శ్రీ బత్తుల శ్రీనివాసరెడ్డి పేరుతో రూ.25.00 లక్షలు పొందినారు.).

స్థలం : వినుకొండ
తేది : 05-12-2025

సం/- అధీకృత అధికారి,
తమిళ్‌నాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్, వినుకొండ బ్రాంచ్.

మార్కెట్‌లో ఆయిల్ పాంకు డిమాండ్

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉండే పంట ఆయిల్ పాం అని, దీని సాగు లాభదాయకమని ఉద్యాన శాఖ అధికారి ఎస్ సురేష్ అన్నారు. జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గోద్రేజ్ ఆగ్రోవెట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో మండలంలోని పాకాలపాడు, లక్కరాజుగార్లపాడు గ్రామాల్లో శనివారం ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కంపెనీ శాస్త్రవేత్త సుబాష్‌శ్రీ సంజయ్ మాట్లాడుతూ దళారి వ్యవస్థ ఉండదని, కంపెనీయే నేరుగా రైతు వద్ద పంటను కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కొనికినేని సత్యనారాయణ, కంపెనీ మేనేజర్ శ్యామ్, మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి నరేంద్ర, టీడీపీ నాయకులు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా స్వామినాయక్

పిడుగురాళ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల డిప్యూటీ ఎంపీడీఓగా స్వామినాయక్‌కు పదోన్నతి లభించింది. గతంలో జానపాడు, కేశానుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతి పొందారు. పిడుగురాళ్లలో శనివారం బాధ్యతలు స్వీకరించారు.

నకరికల్లులో శశికళ బాధ్యతల స్వీకారం

నకరికల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నకరికల్లు డిప్యూటీ ఎంపీడీవోగా అంకిరెడ్డి శశికళ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నకరికల్లు గ్రామ సచివాలయాల అధికారిగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

మండల సచివాలయ అధికారిగా నరసింహానాయక్

బెల్లంకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల సచివాలయ అధికారిగా నరసింహా నాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లంకొండ ఎంపీడీవోను మర్యాద పూర్వకంగా నరసింహా నాయక్ కలిశారు.

9న జాబ్ మేళా

సత్తెనపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు పల్నాడు జిల్లా నైపుణ్యాధికారి ఈ తమ్మాజీరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మలు శనివారం తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు. తమ బయోడేటా ఫారంతో సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్టు ఫోటోలతో హాజరు కావాలన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

నకరికల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని ఎస్‌ఐ కే సతీష్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన నరసరావుపేటలో లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రవేశ పెడుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు కక్షిదారులకు నోటీసులు జారీ చేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

నకరికల్లు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు కోటప్పకొండ స్కిల్ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు జాబ్స్ కో-ఆర్డినేటర్ ఎరగూటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఉపాధి కల్పన సంస్థ, ట్రైనింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సు లో ఉచిత హాస్టల్ భోజన వసతితో ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. మూడు నెలల శిక్షణా కాలంలో కంప్యూటర్ బేసిక్స్, కంప్యూటర్ టైపింగ్ స్పీడ్, ఎక్సెల్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో పాటు కమ్యూనికేషన్ సాఫ్ట్ స్కిల్స్, జాబ్ స్కిల్స్ నేర్పిస్తారని తెలిపారు. వివరాలకు 9908482907 నెంబరులో సంప్రదించాలన్నారు.

భూసార పరీక్ష ప్రాముఖ్యతపై అవగాహన

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునగోడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భూసార పరీక్ష, మట్టి ప్రాముఖ్యతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఏఎంసీ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రవికుమార్, కనకదుర్గ, డాక్టర్ సత్య, పి యాకోబు, ఎం అరుణ, ముఖేష్‌నాయుడు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

వెల్దుర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిగిరిపాడు పీహెచ్‌సీలో శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 20మంది రక్తదానం చేశారు. వీరికి సొసైటీ సభ్యులు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, కూటమినేతలు పాల్గొన్నారు.

జేసీని సన్మానించిన ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ గనోరే బదిలీ సందర్భంగా శనివారం నరసరావుపేట కలెక్టరేట్‌లో జరిగిన వీడ్కోలు సభలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ జేసీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

ఫాదర్ శౌర్రెడ్డి మృతి

మాచర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఫాదర్ శౌర్రెడ్డి శుక్రవారం అనారోగ్య కారణాలతో మృతిచెందారు. మదర్ థెరిస్సా సేవా సమితి సభ్యులు శనివారం శౌర్రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గాదె కిరీటిరెడ్డి, నాగిరెడ్డి, అందుగుల చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, కసిరెడ్డి శాంతిరెడ్డి, మోరా భాస్కరరెడ్డి, యర్రబోతుల శ్రీనివాసరావు, బాలజోజి, జక్కిరెడ్డి మర్రెడ్డి, చిన్నపురెడ్డి పాల్గొన్నారు.

శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి హుండీ ఆదాయం రూ.4,43,815

గురజాలటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. మొత్తం రూ.4,43,815 ఆదాయం సమకూరినట్లు ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామ పెద్దల సమక్షంలో హుండీ లెక్కింపు జరిగినట్లు చెప్పారు.

శ్రీనివాసరావు కుటుంబానికి ఆర్థికసాయం

కారంపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మట్టుపల్లి శ్రీనివాసరావు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, విద్యా కమిటీ ఛైర్మన్ బాలునాయక్, మస్తాన్‌జానిలు శనివారం మృతుని కుటుంబసభ్యులు రూ. 50 వేల ఆర్థికసాయం అందించారు.

కృష్ణానదిలో పారిశుధ్య కార్యక్రమాలు

మాచవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా కృష్ణానదిలో నీరు కలుషితం కావటంతో రేగులగడ్డ, వెల్లంపల్లి, గోవిందాపురం గ్రామాల్లో నదినుంచి దుర్వాసన వస్తోంది. ఆయా గ్రామాలవారు ఈ విషయాన్ని ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఎంపీడీవో విష్ణు చిరంజీవిని ఆయా గ్రామాల పరిధిలోని కృష్ణానదిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో రేగులగడ్డ, వేమవరం, మోర్జంపాడు గ్రామాల్లో కృష్ణానదిలో బ్లీచింగ్, సున్నం పారిశుధ్య కార్మికులు చల్లారు. ఈ కార్యక్రమాన్ని కొన్నిరోజులు కొనసాగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.



కృష్ణానదిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్న దృశ్యం

అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



మాచవరం: బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయ చరిత్ర శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి భయానక వాతావరణం ఏర్పడిందన్నారు. తిరుమల పరకామణిలో దొంగతనం, మద్యం స్కామ్‌లు మాజీ సీఎం జగన్ చిన్న విషయాలు అనడం దారుణమన్నారు. గత వైసీపీ పాలనలో తప్పుడు కేసులు, చట్టవిరుద్ధ పనులకే అవకాశం ఇచ్చారన్నారు. గురజాల నియోజకవర్గంలో తాగునీటి పథకాలకు రూ 150 కోట్ల నిధులు మంజూరైనట్టు వివరించారు. గురజాల నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి రూ 10కోట్లు నిధులు మంజూరైనట్టు వివరించారు. దాచేపల్లిలో గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ కొరకు ఎమ్మెల్యేని కలసి వినతి పత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నేతలు పాల్గొన్నారు. తొలుత దాచేపల్లిలోని టీడీపీ సీనియర్ నాయకుడు నలబోతుల చిన్న, మాజీ వైస్ ప్రెసిడెంట్ మునగ వెంకటేశ్వర్లు, ఇటీవల మృతి చెందిన షేక్ చిన సుభానీ, సర్వేపల్లి నరసింహాచారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బుగ్గమల్లయ్య, వైద ఆలయాలను టూరిజం కింద అభివృద్ధి చేస్తాం

మాచవరం: పల్నాడులో పురాతన చరిత్రగల బుగ్గమల్లేశ్వరస్వామి, వైద అమరలింగేశ్వరస్వామి దేవాలయాలను టూరిజం కింద ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి చేయిస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలోని మోర్జంపాడు శివారు అటవీప్రాంతంలో ఉన్న శ్రీ బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీభ్రమరి ఆచ్ఛాదన మండపాన్ని, దేవాలయ చరిత్ర శిలాఫలకాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా దేవాలయ వంశస్థులు మండాది హరినాథబాబు తదితరులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు చిరంజీవి, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాదు, పీఏసీఎలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని కంభంపాడు, గన్నవరం, రాయవరం గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి నూతన పరిశ్రమలు వస్తున్నాయని, యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. కంభంపాడు, రాయవరంలో రెండు సీసీ రోడ్ల నిర్మాణాలకి శంకుస్థాపన, నూతన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. గన్నవరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నేతలు కారుమంచి శివయ్య, పెండ్లి వెంకటకుమారి వెంకటసుబ్బయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి, కంభంపాటి అనిల్, బెల్లంకొండ కృష్ణ, వజ్రంనాయక్, కూనిశెట్టి రామకృష్ణ, జగడాల శ్రీను, భీమా కృష్ణమూర్తి, గాలి గణేష్, నాసరయ్య, భీమా బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

విజయపురిసౌత్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల మండలం కొత్తపల్లిలోని పోలేరమ్మ బజారు, నాయుళ్ల బజారులో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు.



విజయపురిసౌత్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

అనంతరం రెడ్ల బజారులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మాచర్ల మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, గుండాల శ్రీను, గుండెబోయిన శ్రీనివాసరావు, గంటా శ్రీను, అంజయ్య, వెండి నాగేశ్వరరావు, అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల రంగారెడ్డి, కాలే లూర్థు, జయరాజు, సుధాకర్‌రెడ్డి, సైదారావు, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళులు



పిడుగురాళ్ల: అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని



దుర్గి: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



దాచేపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు జంగా

పిడుగురాళ్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు,. ఏఎంసి ఛైర్మన్ తురకా వీరస్వామి, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, మందా డేవిడ్, వున్నం ఆంజనేయులు, సయ్యద్ అమీర్‌అలి, ఐతం పెదమాణిక్యరావు, కోట హరి, కామిశెట్టి రమేష్, జార్జి, కార్ సైదా తదితరులు పాల్గొన్నారు. పిడుగురాళ్లలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో వున్న అంబేద్కర్ విగ్రహానికి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు ఆవుల జనార్థనరావు, టంగుటూరి వెంకట సతీష్, పట్టాభి, యడవల్లి ఏడుకొండలు, వేముల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహానికి పట్టణ సిఐ ఎస్ వెంకట్రావు, సేవా సమితి అధ్యక్షులు డేగల అబ్రహాం, నలబోతుల రాజు, ఉసిరికాయల అంకారావు, సంపతి వెంకటయాదవ్, పసుపులేటి కోటి, మీసాల లాజర్, గుజ్జర్లపూడి కరుణాకర్, మందా జాకబ్, మరియదాసు, సంద్రపాటి సుధాకర్, గద్దల రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● దాచేపల్లి: దళిత, నిమ్న వర్గాలు అనుభవిస్తున్న హక్కులు డాక్టర్ అంబేద్కర్ కృషి ఫలితమేనని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. శనివారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో బడుగు బలహీన వర్గాల ప్రతినిధులు హాజరయ్యారు.

● దుర్గి: డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలను యువత అలవర్చుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం దుర్గిలో అంబేద్కర్ వర్ధంతిలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు మేకల దాసు, టీడీపీ మండల అధ్యక్షుడు దుర్గెంపూడి జానకిరామయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్, మాగులూరి నారయ్య, కటకం రామారావు, దిగుమర్తి సుబ్బారావు, సింగు నాగేశ్వరరావు, రమణగోపాల్, వీరయ్యచౌదరి, వెంకటేశ్వర్లు, ఆకుల చినచెన్నయ్య, వి.శ్రీనివాసరావు, ఎస్.సుబ్బారావు, మదార్, వేణు, మహేష్, విజయ్, శ్యామ్, సంజీవ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల: పాలువాయి సర్పంచ్ మందలపు హనిమిరెడ్డి గ్రామంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. రెంటచింతల రైలుపేటలో ఎంఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ మరియదాసు, బుజ్జిబాబు, చినలోకయ్య, గడిపర్తి శ్రీనివాసరావు, మరియదాసు, తిక్కా నాగేశ్వరరావు, ఎలీషా, టి.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో తాలూకా సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చౌట శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, బలిజేపల్లి సురేష్‌కుమార్, బండారు నాగరాజు, శనగపూల నరసింహారావు, గుజ్జర్లపూడి స్టాలిని, కూచిపూడి కృపారావు, మస్తాన్‌వలి, గుంటూరు ఆశీర్వాదం, జానీబాబు, పి.వెంకటకోటయ్య పాల్గొన్నారు. మాదిగఉద్యోగుల సమాఖ్య, సత్తెనపల్లి న్యాయవాదుల సంఘం, ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్‌పాల్ ఆధ్వర్యంలో, వైసీపీ కార్యాలయంలో వర్ధంతి నిర్వహించారు.

● నకరికల్లు: అంబేద్కర్ వర్ధంతిని కండ్లకుంట ఎస్సీ కాలనీలో నిర్వహించారు. న్యాయవాది జీ కాన్నారావు, రావెల లింగయ్య, జంపని రామాంజనేయులు, గర్నెపూడి ఆనందరావు, రమేష్, స్వరూప్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్: డాక్టర్ అంబేద్కర్ వర్ధంతిని లక్కరాజుగార్లపాడు ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

● అమరావతి: డాక్టర్ అంబేద్కర్ వర్ధంతిని మండలంలో నిర్వహించారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతిఒక్కరు కొనసాగించాలని పలువురు తెలియజేశారు.

● అచ్చంపేట: సామాజిక తత్వవేత్త డాక్టర్ అంబేద్కర్ అని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అన్నారు. అచ్చంపేటలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలా సాంబయ్య, గంధం కోటేశ్వరరావు, సందెపోగు గాంధీ, చల్లా అనూపకళ, టి.ఆంజనేయులు, స్వామి, వేమవరపు మాణిక్యరావు, కోటా చంటి, సందెపోగు వెంకటరావు, కె.దిబ్బయ్య పాల్గొన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు చిలకా చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుగ్గి శ్రీనివాసరావు అంబేద్కర్‌కు నివాళులర్పించారు. సందెపోగు అశోక్, అంబేద్కర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో క్రోసూరు ఏఎంసీ వైస్ ఛైర్మన్ సాంబశివుడు, చంద్రయ్య పాల్గొన్నారు.

● క్రోసూరు: క్రోసూరులో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. కాంద్రు కాశయ్య, డాక్టర్ మహమ్మద్ షరీఫ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహన్ ఆధ్వర్యంలో కూటమిపార్టీల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ నాయకులు, బీఎస్పీ నాయకుల ఆధ్వర్యంలోనూ అంబేద్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాన్, నాయకులు కొమ్మినేని సతీష్, మైసూర్‌బాబు, హనుమంతరావు, మరియదాసు, లక్ష్మయ్య, మన్నెం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కారంపూడి స్థానిక ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్లో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. జనసేన పార్టీ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, తెలగనేడి లక్ష్మయ్య, కామినేని ఏడుకొండలు, సంక సోమయ్య, అరబోలు ఏడుకొండలు, చలువాది సాయి, కాసు సీతారామయ్య, పల్లా చందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల: పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ వేణుబాబు ఆధ్వర్యాన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గంజర్ల లక్ష్మి, ప్రజాసంఘాల ఆధ్వర్యాన పట్టణంలో నివాళులర్పించారు. ఈ కుక్కమూడి ప్రసాద్, పేరుపోగు జార్జి, కర్రా చిన్న రంగయ్య, గురజాల అప్పారావు, బొడ్డుపల్లి ఈశ్వరయ్య, పరిమళ రాజారావు, గాలయ్య, కిన్నెర అచ్చయ్య, కడియం శారమ్మ పాల్గొన్నారు.



మాచర్ల పురపాలక సంఘ కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



సత్తెనపల్లి: తాలూకా సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కూటమి నేతలు

పల్నాడు ప్రజల్లో మార్పు రావాలి: టీటీడీ బోర్డు మెంబర్ జంగా



దుర్గి: మాట్లాడుతున్న జంగా

దుర్గి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల్లో మార్పు రావాలని, కక్షలు, కార్పణ్యాలకు తావివ్వకుండా పిల్లల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని టీటీడీ బోర్డు మెంబర్, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండలంలోని ముటుకూరు, పోలేపల్లి, ఆత్మకూరు గ్రామాల్లో బూత్ కమిటి సభ్యులు, టీడీపీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధిని ప్రజలకు అందిస్తుందన్నారు. అధికారం చేపట్టిన యేడాదిలోనే ఎన్నికల హామీలైన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసిందన్నారు. గ్రామాల్లో నేతల మధ్య సమన్వయ లోపం ఉందని, వారి సమస్యలను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, రానున్న ఎన్నికల్లో మరింత భారీ మెజార్టీతో కూటమి ప్రభుత్వం గెలవడమే ధ్యేయంగా పని చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ముందుగా దుర్గిలో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సింగు నాగేశ్వరరావు, దుర్గెంపూడి జానకి రామయ్య, బ్యంగా లింగయ్య, ఆత్మకూరు టీడీపీ అధ్యక్షుడు బ్యంగా వెంకటేశ్వర్లు, రామాంజినేయులు, నాగయ్య, ముత్తినేని పుల్లయ్య, బ్యంగా శ్రీను, కేలం ఆదినారాయణ, రాజు, నారాయణ, యేసోబు, కంఠం బ్రహ్మయ్య, తిక్కా కోటేశ్వరరావు, రమణ, మాబాషా, గుమ్మా వెంకటేశ్వర్లు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు మహర్దశ : మంజులారెడ్డి

రెంటచింతల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హయాంలో పల్నాటి ఆలయాలకు మహర్దశ పట్టిందని శిల్పారామం ఛైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెంటాలలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, భీమేశ్వరస్వామి ఆలయాలకు తాజాగా రూ.1.46 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇప్పటికే సత్రశాల ఆలయానికి రూ.3 కోట్ల 33 లక్షల, 33 వేలు మంజూరు చేశారన్నారు. సమావేశంలో సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, వెన్నా కృష్ణారెడ్డి, నాళం పెదబాబు, కొత్త అంజి, వైవీ సైదయ్య, సర్వారెడ్డి, ఆకుల నరసింహారావు, బి.సుంకయ్య తదితరులున్నారు.

మృతదేహంతో కుటుంబసభ్యుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

కారంపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలంటూ మృతదేహంతో కుటుంబసభ్యులు ఆందోళన చేసిన సంఘటన కారంపూడిలో శనివారం జరిగింది. కారంపూడికి చెందిన బత్తుల ముసలయ్య (48) శనివారం అనారోగ్య కారణాలతో స్థానికంగా ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరాడు. చికిత్స పొందుతూ గుండెపోటుతో మరణించాడు. కాగా కుటుంబసభ్యులు ముసలయ్య మృతదేహాన్ని స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్దకు తెచ్చి ఆందోళనకు దిగారు. ముసలయ్య మరణానికి రెవెన్యూ అధికారులే కారణమంటూ ఆరోపించారు. ముసలయ్య వినుకొండ రోడ్డులోని భూమిని ఎన్నో యేళ్లుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, అతని పొలంలో కొందరు వ్యక్తులు రాళ్లుపాతి ఆక్రమించుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని మనస్తాపంతో చనిపోయాడని కుటుంబసభ్యులు వాపోయారు. రెవెన్యూ అధికారులు న్యాయం చేస్తామంటూ చెప్పడంతో ఆందోళన విరమించారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌ను వివరణ కోరగా.. మృతుడు ముసలయ్య సర్వే నెం.772-3, 772-1లలో సాగు చేస్తున్నాడని, ఈ సర్వే నంబర్లలో అసైన్డ్ భూమి ఉందని, శుక్రవారం తాను భూమిని పరిశీలించానని, రికార్డులను పరిశీలించి కొలతలు వేయిస్తామని ముసలయ్యకు చెప్పినట్లు తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలకు షోకాజ్

గురజాలటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో గల గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం తాళాలు కూడా తీయకపోవడంపై శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన మాడుగుల వైద్యాధికారి ప్రదీప్ విచారించి ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్‌ఎంలకు షోకాజు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న నలకోటయ్య, కుటుంబ సభ్యులు

రాజుపాలెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తన పొలం ఆన్‌లైన్ చేయాలని ఓ వృద్ధుడు కుటుంబసభ్యులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. బాధితుల కథనం మేరకు నలకోటయ్యకు రాజుపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నెం.229/42-1ఏ1లో పూర్వీకుల నుండి వచ్చిన ఎకరం 90 సెంట్ల భూమి ఉంది. 2016 వరకు భూరికార్డులలో ఆయన పేరు ఉంది. నలకోటయ్య ఈ భూమిని తన వియ్యంకుడు శ్రీనివాసరావుకు విక్రయించాడు. అప్పటి తహసీల్దార్ కటకం నగేష్ భూరికార్డుల్లో నలకోటయ్య పేరు స్థానంలో శ్రీనివాసరావు పేరు ఎక్కించాల్సి ఉండగా బత్తుల శ్రీలక్ష్మీ పేరు ఎక్కించినట్లు బాధితుడి కుమారుడు సుబ్రహ్మణ్యం తెలిపాడు. అప్పటినుండి నేటికీ ఆన్‌లైన్లో పేరు మార్చాలని తిరుగుతున్నట్లు చెప్పాడు. ఫలితం లేకపోవటంతో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్నామన్నారు. తమకు న్యాయం జరిగేవరకు నిరసన కొనసాగుతుందన్నారు. తహసీల్దార్ సరోజ విషయం తెలుసుకుని పొలం వద్దకు వెళ్లి పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరోజ మాట్లాడుతూ 229 సర్వే నెంబరు 2023 నుండి కోర్టులో ఉందని తెలిపారు.

గేదెల పెంపకంతో మంచి ఆదాయం

● ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి



మాట్లాడుతున్న పీడీ ఝాన్సీరాణి

రాజుపాలెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలలో రుణాలు తీసుకున్న సభ్యులందరూ ఆదాయాన్ని పెంచుకునేలా యూనిట్‌ను గ్రౌండింగ్ చేసుకుంటే గేదెల ద్వారా మంచి ఆదాయం వస్తుందని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి తెలిపారు. శనివారం రాజుపాలెంలో మండల సమాఖ్య కార్యాలయంలో రైతు సంఘాలు, పాడి పశువులు కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో సంపూర్ణ పశుధాన్ కవచ్ అధికారి విజ్ఞాన్ బాబు, పశు వైద్య అధికారి రాజ్‌కుమార్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, ఏపీఎం శివకుమార్, సీసీలు ఉమా మహేశ్వరరావు, చంద్రరావు, విజయమ్మ, కోటమ్మ, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు

● ఎక్సైజ్ సీఐ తులసీ

క్రోసూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమని క్రోసూరు ఎక్సైజ్ సీఐ టీ తులసీ అన్నారు. శనివారం క్రోసూరు కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నడవడిక, క్రమశిక్షణ విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శ్యామ్‌సన్ మాట్లాడుతూ ఆడ పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా పేదవిద్యార్థులకు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వెట్టర్లు పంపిణీ చేశారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, ప్రిన్సిపల్ ఇందిరాప్రియదర్శిని, కంచర్ల బుల్లిబాబు, శ్రావణి, రామకృష్ణ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు, నేల ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

● వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సత్య గోపాల్

క్రోసూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు, నేల ఆరోగ్యం గురించి విద్యార్థులు ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సత్యగోపాల్ అన్నారు. శనివారం క్రోసూరు ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొని భూసార పరీక్షల విధానం, సేంద్రీయ వ్యవసాయం, నేల ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు యాకోబు, జిల్లా వ్యవసాయ కేంద్రం అధికారులు అరుణ, క్రోసూరు ఏవో వీ వేణుగోపాల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మేరీ సూజన్ తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రసాయన రహిత పంటలు సాగుతో మానవ ఆరోగ్యంతో పాటు పర్యావరణం రక్షించబడుతుందని బీపీటీటీసీ సైంటిస్టు డాక్టర్ సత్య గోపాల్ అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మట్టి, ఆరోగ్యం, సేంద్రియ వ్యవసాయంపై 8, 9 తరగతుల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గోపాల్ మాట్లాడుతూ రసాయన వినియోగం లేకుంటే నేల ఉత్పాదకత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో పీ వెంకటేశ్వర్లు, ఏవో ఎస్‌టీఎల్ యాకోబు, ఏవో డీఆర్‌సీ ఎం అరుణ, షరీఫ్, ప్రిన్సిపాల్ కే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



క్రోసూరు: భూసార పరీక్ష విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

మాచర్ల, గురజాల నియోజకవర్గ స్థాయిలో 8 నుంచి విజ్ఞాన్ బాల మహోత్సవం

రెంటచింతల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ యూనివర్శిటీ నేతృత్వంలో ఈ నెల 8 నుంచి రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్లో బాల మహోత్సవం క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు విజ్ఞాన్ యూనివర్శిటీ ఫిజికల్ డైరక్టర్ కె. మోహనకృష్ణ చెప్పారు. శనివారం పాఠశాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల బాలబాలికలకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్‌లో 100, 800 మీటర్ల పరుగు పందేలు, 4+100 రిలే, షాట్‌పుట్,లాంగ్ జంప్, చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పల్నాడు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో విజేతలకు జనవరిలో విజ్ఞాన్ యూనివర్శిటీలో సెంట్రల్ స్థాయి పోటీలుంటాయన్నారు. ఆహ్వానం అందని పాఠశాలల వారు ఎవరైనా నేరుగా క్రీడా ప్రాంగణంలోకి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల వివరాలకు 8919984271 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో పీఈటీ కె.సురేష్, సుధీర్‌రెడ్డి, ఎం.రాంబాబు, శౌరయ్య తదితరులు పాల్గొన్నారు.





జంపని హైస్కూల్‌లో పాల్ ల్యాబ్‌లో ట్యాబ్స్ ద్వారా సామర్థ్యాన్ని గుర్తిస్తున్న విద్యార్థులు

● 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ
● పాఠ్యాంశాల పెంపుదలకు ప్రత్యేక తరగతులు
● వారానికోసారి సమీక్షలు

పాఠశాలల్లో పాల్ ల్యాబ్స్

వేమూరు, డిసెంబరు 06 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థల్లో ఆధునిక విద్యాబోధన అందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. విద్యా విధానాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ముందడుగు వేస్తోంది. విద్యార్థులకు ఆధునిక విద్యాబోధన అందించే దిశగా పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో పాల్ ల్యాబ్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ ల్యాబ్స్‌ను 2015 నుంచి 2019 మధ్య టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేసింది, అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ విధానానికి స్వస్తి పలికింది. అప్పుడు ఇచ్చిన ట్యాబ్‌లను వెనక్కి తీసుకుంది. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం కొన్ని మార్పులు చేస్తూ పాఠశాలల్లో ప్రత్యేకంగా పాల్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేస్తోంది. గుర్తించిన పాఠశాలకు 30 నుంచి 35 వరకు ట్యాబ్స్‌ను సరఫరా చేస్తోంది.

● ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

ప్రభుత్వం ల్యాబ్‌ల నిర్వహణకు గణితం, తెలుగు, ఇంగ్లీషు సబ్జెక్టులకు సంబంధించి ముగ్గురు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. విద్యార్థుల మేధస్సుకు మరింత పదును పెట్టేందుకు ఏర్పాటు చేసిన ల్యాబ్‌లలో 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు ప్రతిరోజు మూడు సబ్జెక్టులలో తరగతులను కేటాయిస్తున్నారు. నవంబరులో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లాలో 47 పాఠశాలలను గుర్తించారు. నియోజకవర్గంలో జంపని, ఐలవరం, అమృతలూరు, యడ్లపల్లి పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు.

● విద్యార్థి స్థాయిని బట్టి ప్రశ్నలు

ఈ విధానం ద్వారా ఆయా ట్యాబ్‌లలో విద్యార్థి తన కోడ్ నెంబరును క్లిక్ చేస్తే అతని ఫోటో వివరాలు కనబడతాయి. విద్యార్థి తన స్థాయిని బట్టి ప్రశ్నలు, సమాధానాలను అవగాహన చేసుకొని క్లిక్ చేసిన తరువాత ఆ విద్యార్థి ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చింది వివరాలు వెలువడతాయి. విద్యార్థి స్థాయి తక్కువగా ఉన్నట్లయితే కొంచెం తక్కువ స్థాయి ప్రశ్నలు ఇస్తారు. పాఠ్యాంశాల్లో ప్రతి చాప్టర్‌కు సంబంధించిన వివరాలు పొందుపరుస్తారు. అప్లికేషన్ మోడ్‌లో దీనిని ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ విధానంపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారని, ఈ పద్ధతి ద్వారా మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

● మంచి మార్కులు సాధిస్తా



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నూతన విధానం ద్వారా మంచి మార్కులు సాధించే అవకాశం ఏర్పడింది. ప్రధానంగా సబ్జెక్టుపై అవగాహన పెరగడంతో పాటు జనరల్ నాలెడ్జ్, గ్రామర్‌పై కూడా పట్టు సాధించే అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నా.

-8వ తరగతి విద్యార్థిని మహ్మద్ కరిష్మా

● విద్యార్థికి స్వయంగా ఎదిగే అవకాశం



ఈ నూతన విద్యా విధానంతో విద్యార్థికి తన స్థాయిని బట్టి స్వయంగా అభివృద్ధి చెందే అవకాశం దక్కింది. ఈ విధానంతో విద్యార్థి తెలియని విషయాలపై అవగాహన పెంచుకోవచ్చు, పైస్థాయికి వెళ్లేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుంది. తద్వారా మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

-ప్రధానోపాధ్యాయుడు బదిరీ నారాయణ

వైభవంగా త్రికోటేశ్వర స్వామి ఆరుద్రోత్సవం



కోటప్పకొండ (నరసరావుపేట), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆరుద్రోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కోటయ్య స్వామికి మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి మేధా దక్షణామూర్తి మాలధారణ స్వాములు ఇరు ముడులతో కోటయ్య సన్నిధికి చేరుకున్నారు. కర్పూర జ్యోతి దర్శనం అనంతరం స్వామికి ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, ఎండు ఫలాలు, సుగంధ ద్రవ్యాలు, విభూది, కుంకుమ, గంధం, తైలంలతో అభిషేకాలు నేత్ర పర్వంగా జరిగాయి. ఆలయంలో స్వామికి ఆరుద్రోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. మేధా దక్షణామూర్తి స్వాములు ఇరుముడులు స్వామికి సమర్పించి పూజల అనంతరం దీక్షను విరమించారు. తాళ్ళ వెంకట కోటిరెడ్డి, శీలం జయరామిరెడ్డి, అల్లు రమేష్, స్వాములకు అన్నప్రసాదం వితరణ చేశారు. స్వాములు కోటయ్య స్వామి గీతాలను ఆలపించారు. చిన్నారులు నృత్య ప్రదర్శన, భక్తి పాటలతో సంగీత విభావరి భక్తులను అలరించాయి. తెల్లవారు జామున స్వామికి అన్నాభిషేకం జరగనుంది. అనంతరం త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకరణ చేస్తారు. ఆదివారం ఉదయం 8 గంటలకు యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర, శాంతి, వాస్తు హోమాలు జరగనున్నాయి. ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.



ఇరుముడులతో వచ్చిన మేధా దక్షణామూర్తి మాలాధారణ స్వాములు

ఫిర్యాదులకు.. ఆన్‌లైన్ పోర్టల్

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



బాపట్ల బాలికా సదన్‌లో కలెక్టర్ డాక్టర్ వినోద్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

బాపట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు నాలుగు అంకెల ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్‌తో పాటు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. బాపట్ల పట్టణంలోని బాలికా సదన్, శిశుగృహ, సఖీ వన్ స్టాప్ సెంటర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. బాపట్ల సందర్శనకు వచ్చిన డాక్టర్ రాయపాటి శైలజను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో పోష్ చట్టంపై ఐసీసీ కమిటీలకు అవగాహన కల్పించాలని శైలజ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పని ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొనే వేధింపులపై ఐసీసీ కమిటీలకు సరైన అవగాహన ఉండటంలేదన్నారు. త్వరలోనే పోష్ చట్టంపై అవగాహన సెమినార్‌లు నిర్వహించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లకు మహిళా కమిషన్ తరుపున లేఖలు పంపుతామని శైలజ తెలిపారు. అనంతరం శిశు గృహ, బాల సదన్‌లో ఉన్న చిన్నారులతో ఆమె ముచ్చటించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి అక్కడ రికార్డులను పరిశీలించారు. 8 సీసీ కెమెరాలు ఉండగా వాటి లో 2 మాత్రమే పనిచేయటంపై ఆరా తీశారు. మూమెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు. వార్డెన్, కేర్‌టేకర్, తరగతి గదులు తదితర అంశాలు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

● లైంగిక వేధింపులపై ఎక్కువ ఫిర్యాదులు

ఉద్యోగ ప్రదేశంలో మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు కమిషన్‌కు ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని విలేకరులతో మాట్లాడుతూ రాయపాటి శైలజ తెలిపారు. విద్యార్థినులకు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌లపై అవగాహన కల్పించటం, అనుమానాస్పద వ్యక్తుల ప్రవర్తనపై అప్రమత్తం చేయటానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థినులు చిన్న వయసులో తెలిసీ తెలియక అట్రాక్షన్‌కు గురై మోసపోతున్నారని తెలిపారు. తల్లిదండ్రుల అనుమతిలేనిదే గురుకుల పాఠశాల విద్యార్థులను బయటకు పంపకూడదన్నారు. నైట్ సెక్యూరిటీతోపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలన్నారు. సఖీవన్‌స్టాప్ సెంటర్‌లో 24 గంటలు మహిళలు, బాలికలకు సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. పర్యటనలో భాగంగా ఆమెను కలవటానికి వచ్చిన ఓ మహిళతో మాట్లాడి సమస్యపై అప్పటికప్పుడు పట్టణ ఎస్సైని పిలిపించి చర్యలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఇ.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, ఐసీడీఎస్ పీడీ రాధా మాధవి, సోషల్ వెల్ఫేర్ డీడీ జె.రాజాదెబోరా, బాలికాసదన్ సూపరింటెండెంట్ ఎస్.సుబ్బలక్ష్మీ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

● మూడు కిలోలకు పైగా గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ భానోదయ, పక్కన సీఐ వంశీధర్, వెనుక నిందితులు

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఎనిమిది మంది సభ్యుల ముఠాను నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. శనివారం నల్లపాడు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ డీఎస్పీ భానోదయ నిందితులను మీడియా ఎదుట హాజరుపరచి వివరా లు వెల్లడించారు. కొత్తకాలనికి చెందిన ముప్పిరి సుబ్బారావు, సాయినగర్‌కు చెందిన వేము ల యోహాన్, శ్రీనివాసరావుతోటకు చెందిన రౌడీషీటర్ షేక్ షఫీ,అడవితక్కెళ్ళ పాడుకు చెందిన గాజులవర్తి హర్షవర్ధన్ చంద్ గంజాయి విక్రయిస్తున్నారని తెలిపారు. స్వర్ణభారతిన గర్‌కు చెందిన షేక్ ఇమ్రాన్, అడవితక్కెళ్ళపాడుకు చెందిన షేక్ షరీఫ్, నిమ్మగడ్డ వెంకటేష్, స్వర్ణభార తినగర్‌కు చెందిన షేక్ ఆసిఫ్ గంజాయి సేవిస్తున్నారని చెప్పారు. ఈ 8 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నింది తుల్లో ముప్పిరి సుబ్బారావు, షేక్ షఫీపై నగరంపాలెం స్టేషన్‌లో రౌడీషీట్‌లు ఉన్నాయని, షేక్ ఇమ్రాన్, నిమ్మగడ్డ వెంకటేష్‌పై హత్యాయత్నం కేసులు ఉన్నాయని డీఎస్పీ వెల్లడించారు. గంజాయి అమ్మకం గురించి సమాచారం తెలిస్తే 112 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ చెప్పారు.

నిలువు దోపిడీ

(5వ పేజీ తరువాయి)

తీసుకొస్తారు. పల్నాడు జిల్లాలో కూడా కొన్ని కేంద్రాలు మాత్రమే ఉన్నందున దూరం నుంచి తెచ్చి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. ఒక వేళ పత్తి వెనక్కి తీసుకు వెళ్లినా ప్రయివేట్ వ్యక్తులు క్వింటాల్ పత్తి రూ.5 వేల నుంచి రూ.6 వేలు వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అందువల్ల రైతులు బయ్యర్లు చెప్పినట్లుగా వినాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

సీజన్ ఉండదేమో

ఇప్పటికే సీసీఐ పత్తి కొనుగోలు వ్యవహారంపై తీవ్ర వివాదాలు చుట్టు ముట్టాయి. సీసీఐ నిబంధనలు ప్రకారం పత్తిని కొనాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మాజీ మేనేజర్ హైకోర్టులో కేసు వేశారు. సీసీఐ కంపెనీస్ లా ను ధిక్కరించి పత్తిని కొని.. జిన్నింగ్ చేస్తూ వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తోందని ఆయన కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. దేశ వ్యాప్తంగా సుమారు రూ.18 వేల కోట్లు ప్రజా సొమ్మును సీసీఐ దుర్వినియోగం చేసిందని పిటీషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి త్వరలో తీర్పు రానుంది. ఒక వేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే ఈసారి సీజన్ ఉండక పోవచ్చు అన్న భావన సీసీఐలోని అన్ని స్థాయిల్లో వ్యక్తం అవుతోంది. సీఐడీ కూడా గతేడాది సీసీఐ వేదికగా జరిగిన రూ.140 కోట్ల దూది మాయం వ్యవహారం పై సీరియస్‌గా విచారణ జరుపుతోంది. రేపో, మాపో ఈ వ్యవహారం లో ఎఫ్ఐఆర్ నమోదు అయ్యే అవకాశం ఉంది. అందువల్ల ఈ సంవత్సరమే.. ఇల్లు చక్క పెట్టుకుందాం అనే ఆలోచనతో కొందరు బయ్యర్లు మితిమీరిన పద్ధతిలో కోత విధిస్తున్నట్లు స్పష్టం అవుతోంది.

పాలకుల్లేని.. పురాలకు మొండిచేయి

(5వ పేజీ తరువాయి)

మంగళగిరి, తాడేపల్లి మునిసిపాలిటీలను విలీనం చేసి.. గ్రేటర్ మంగళగిరిగా మార్చు చేసింది. ఈ ప్రక్రియలో జరిగిన జాప్యం కారణంగా ఈ రెండు మునిసిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించ లేదు. నూతన పాలక వర్గాలు కొలువుదీరే వరకు ఆయా పురపాలక సంఘాలు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే పరిస్థితి లేదు. నరసరావుపేట పొరుగున ఉన్న చిలకలూరిపేట మునిసిపాలిటీకి తాజాగా రూ.4.73 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఇదే స్థాయిలో నరసరావుపేట మునిసిపాలిటీకి నిధులు సమకూరే వీలుండేది. ఈ నిధులు సమకూరి ఉంటే రహదారులు, కాలువలు ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండేది.

భాషను బతికించుకుంటేనే మనుగడ

● మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు
● తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాలు ప్రారంభం



సభలో మాట్లాడుతున్న పాపినేని శివశంకర్

తెనాలి అర్బన్, డిసెంబరు 06 (ఆంధ్రజ్యోతి): భాషతో పాటు సంస్కృతి మనిషి జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయని, భాషను బతికించుకుంటేనే మనిషి మనుగడ సాధ్యమని మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు జరిగే తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాలను శనివారం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. తొలుత సుప్రసిద్ధ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చందు సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, తెలుగు భాష, సాహిత్యం పట్ల వ్యతిరేకంగా మాట్లాడటం తగదని అన్నారు. మాతృ భాషతోనే అన్ని భాషల్లో ప్రావీణ్యం సాధించగలమని చెప్పారు. కేంద్ర, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ మాట్లాడుతూ, తమిళులు త్యాగరాయ కీర్తనలు పాడుతున్నారనంటే తెలుగు భాష గొప్పతనం అర్థమవుతోందన్నారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉత్సవాలలో తెలుగు ఆచార్యులు నారిశెట్టి వెంకటకృష్ణారావు, మొవ్వా సత్యనారాయణ, బొల్లిముంత కృష్ణ, చింతల శ్రీనివాసరావు ప్రసంగించారు. తన్నీరు శివశంకర్, బెల్లంకొండ వెంకట్, భీమేశ్వరప్రసాద్, రమేష్ పర్యవేక్షించారు.

డాక్టర్ నందకిషోర్‌కు ఐఎంఏ జాతీయ అవార్డు



డాక్టర్ గార్లపాటి నందకిషోర్

గుంటూరు మెడికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు చేసిన కృషికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్‌కు బెస్ట్ ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్‌గా జాతీయ అవార్డు లభించింది. ఈ మేరకు ఢిల్లీలోని ఐఎంఏ జాతీయ కార్యాలయం నుంచి ఆయనకు సమాచారం అందింది. ఈ నెల 27, 28వ తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే ఐఎంఏ జాతీయ సదస్సులో డాక్టర్ నందకిషోర్‌కు అవార్డును అందజేస్తారు. ఏపీలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఆయన వైద్యుల సమస్యల పరిష్కారం చేసిన కృషితో పాటు ప్రభుత్వ ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో కలసి ప్రజారోగ్య పరిరక్షణ చర్యల్లో పాలుపంచుకోవడం వంటి సేవలకుగాను ఐఎంఏ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాగళ్ల కిషోర్, సీపీజీ డైరెక్టర్ డాక్టర్ ఎం ఫణీకుమార్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డి.శ్రీహరిరావు, గుంటూరు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.సుబ్బారాయుడు తదితరులు నందకిషోర్‌ను అభినందించారు.

నృత్యం.. సమ్మోహన భరితం



గుంటూరు(తూర్పు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా నాట్య గురు ఎస్కే ఖలీల్ ఆధ్వర్యంలో జరిగిన నాట్య నెలవంక సంబరంలో చిన్నారుల కూచిపూడి నాట్య కళా ప్రదర్శనలు సమ్మోహన పరిచాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి పలు ప్రాంతాలకు చెందిన చిన్నారులు గణపతి తాళం, వచ్చేను అలమేలు మంగ, జయ జయ దుర్గే, కృష్ణం కలయే సఖి, కొండలలో నెలకొన్న, రుక్మిణి ప్రవేశం, శివస్తుతి, భో శంభో, రామా యణ శబ్దం, వినాయక కౌమతి, హరివర్‌సనమ్, ముద్దుగారే యశోద, ప్రహ్లాద పట్టాభిషేకం తదితర కీర్తనలకు లయబద్ధంగా నర్తించి ప్రేక్ష కులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు గురు ఎస్కే ఖలీల్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నృత్యపోటీలు జరుగుతా యని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం సబ్ జూనియర్స్, జూనియర్స్, సీని యర్ సోలో విభాగాల్లో 76 మంది కళాకారులు కూచిపూడి ప్రదర్శించారని వివరించారు. ఆది వారం ఇవే విభాగాలతో పాటు బృంద, జంట, జానపద నృత్య పోటీలు జరుగుతాయని తెలిపారు. అనంతరం హిందూ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కేవీఎస్ దుర్గా ప్రసాదుకు సేవా రత్నం పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.









రేషన్ బియ్యం తరలిస్తున్న టాటా ఏస్ వాహనం



రేషన్ బియ్యం అక్రమ రవాణా

పోలీసుల అదుపులో నిందితులు

చేబ్రోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నిందితులను చేబ్రోలు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, కొండపూడి రమేష్, నూర్‌బాషా బాజీ అనే వ్యక్తులు 60 బస్తాల రేషన్ బియ్యాన్ని చుండూరుకు తరలిస్తుండగా మంచాల వద్ద తనిఖీల్లో పట్టుబడ్డారని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితుడు జ్యోతి బాబు మృతి

పొన్నూరుటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుడు చింత జ్యోతి బాబు గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. పొన్నూరు పట్టణానికి చెందిన జ్యోతిబాబు అగ్రిగోల్డ్ కంపెనీ ఏజెంట్‌గా అనేక మందితో అగ్రిగోల్డ్ డిపాజిట్లు చేయించాడు. జ్యోతిబాబు మృతి చెందిన విషయం తెలుసుకున్న అగ్రిగోల్డ్ బాధితుల సంక్షేమ సంఘం పొన్నూరు మండల కార్యదర్శి శేఖర్ బాబు నియోజకవర్గం అధ్యక్షుడు రామారావు, గురుమూర్తి, రామకృష్ణ, కరిముల్లా, తదితరులు జ్యోతి బాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జ్యోతి బాబు కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉద్యోగుల సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలి

● ఎంపీహెచ్‌ఈవోఎస్ అసోసియేషన్

నాదెండ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న 12 మంది ఆరోగ్య సిబ్బందిని సస్పెండ్ చేయడాన్ని ఎంపీహెచ్‌ఈవోఎస్ అసోసియేషన్ శనివారం ఒక ప్రకటనలో ఖండించింది. ప్రాథమిక విచారణ చేయకుండా ఉద్యోగులను సస్పెండ్ చేయటం అన్యాయమని సంఘ నాయకులు తెలిపారు. వెంటనే సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసి ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులను బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కేంద్రాల్లో రాత్రి వేళ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రక్షణ కల్పించాలని ఆరోగ్య విస్తరణ అధికారుల సంఘం వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ శివయ్య, ప్రధాన కార్యదర్శి కే రామరాజులు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించారు.

13న జాతీయ లోక్ అదాలత్

వినుకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం. మహతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకావకాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలంటే స్వయంగా తమను కలవాలని తెలిపారు.

జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా నాగిరెడ్డి



యడ్లపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం (జీఎస్‌డబ్ల్యూఎస్) అధికారులుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు కలెక్టర్ కృతికాశుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. యడ్లపాడు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శశికళ, జగ్గాపురం పంచాయతీ కార్యదర్శి పీవీ నాగిరెడ్డి, ఉన్నవ పంచాయతీ కార్యదర్శి జయబాబు, కొండవీడు పీఎస్ విశ్వరూపాచారిలకు జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులుగా పదోన్నతులు లభించాయి. యడ్లపాడు మండల గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం (జీఎస్‌డబ్ల్యూఎస్) అధికారిగా పీవీ నాగిరెడ్డి నియమితులయ్యారు. శశికళను నకరికల్లు, విశ్వరూపాచారిని గురజాల మండలాలకు కేటాయించి బదిలీ చేశారు. కాగా జగ్గాపురం పీఎస్‌గా పనిచేస్తున్న నాగిరెడ్డిని జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా నియమించగా ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

చిలకలూరిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థిని రాజేశ్వరికి చిలకలూరిపేట రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు శనివారం కాపు వెంకటరావు రూ.10 వేలు ఆర్థిక అందజేశారు. కార్యక్రమంలో వలివేటి వెంకట సత్యనారాయణ, కనమర్లపూడి రామబ్రహ్మం, దామర్ల రవికుమార్, మున్నలూరి గోపి, కోటి సుబ్బారావు పాల్గొన్నారు.

అస్సాంలో వినుకొండ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


కుందుర్తి హనుమత్ శాండిల్య (ఫైల్‌ఫొటో)

వినుకొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయిని కుమారుడు అస్సాంలోని గౌహతి నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వినుకొండ మండలం నడిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కుందుర్తి రమాదేవి, శావల్యాపురం జడ్పీ హెచ్‌ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రవికుమార్‌ల కుమారుడు హనుమత్ శాండిల్యా(23) మృతి చెందడంపై ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు రవి, రమాదేవిల ఇంటి వద్దకు వెళ్లి ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం శాండిల్యా మృతదేహానికి దహనసంస్కారాలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

జిల్లా యువజనోత్సవ పోటీలకు ఆహ్వానం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు ఈ నెల 9వ తేది నుంచి స్థానిక ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ముఖ్య కార్యనిర్వహక అధికారి తెలిపారు. ఈ పోటీలలో జానపద నృత్యం గ్రూపు (ఫోక్ డాన్సు గ్రూపు), జానపద గీతాలు (ఫోక్ డాన్సు గ్రూపు), కథారచన (స్టోరి రైటింగ్), కవిత్వం (పోయట్రీ రైటింగ్), చిత్రలేఖనం (పెయింటింగ్), ప్రసంగం (డిక్లరేషన్), విజ్ఞానం, సాంకేతికతలలో ప్రాజెక్టు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రదర్శనకు సంబంధించిన సామగ్రి కళాకారులే సమకూర్చుకోవాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కళాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారని తెలిపారు.

9న జాబ్ మేళా

సత్తెనపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాధికారి ఈ తమ్మాజీరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మలు శనివారం తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి

● ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు
● రూ.74.5 లక్షలతో సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన నరసరావుపేట మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ నరసరావుపేట మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దు తామని అన్నారు. టీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ నిధులు రూ.74.50 లక్షల వ్యయంతో నాలుగు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. పట్టణంలోని ఒకటో వార్డు చంద్రబాబునాయుడు కాలనీలో రూ.18.9 లక్షలు, 6వ వార్డు రూ.7.10 లక్షలు, 11వ వార్డు 18.5 లక్షలు, 33వార్డు హోసన్నా మందిరం వద్ద రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపడతారని తెలిపారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదికకు విశేష స్పందన

నరసరావుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వ హించిన ప్రజావేదికకు శనివారం విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే అరవిందబాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, ఆస్పత్రులు, పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, తదితర సమస్యలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం నా బాధ్యత అన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు అణగారిన వర్గాలకు దిక్సూచి

● ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు


పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, తదితరులు


వినుకొండలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నరసరావుపేటటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ ఆశయాలు సమాజంలో అణగారిన వర్గాల ఆత్మస్థైర్యానికి, సమానత్వానికి దిక్సూచిగా నిలుస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు అంబేడ్కర్‌కాలనీలో అంబేడ్కర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. దళిత బహుజన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్ల సమాజంలో అందరూ హక్కులు కలిగి ఆనందంగా జీవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వజ్రబాబు, సందీప్‌కుమార్, స్వర్ణ శివ, సాగర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ: భారతరాజ్యాంగం నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వినుకొండ మార్కెట్‌యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణయాదవ్ నరరావుపేట రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నరసరావుపేట రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మారు తివరప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెల్లటూరు రోడ్డులోని మాలమహానాడు కార్యాల యం నందు, బీఎస్పీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

● బొల్లాపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాల యం వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బొల్లాపల్లిలో గల అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి ఏపీ గిరిజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోటానాయక్, ఎంపీడీవో పీ మాధురి, ఎస్ఐ షేక్ సమీర్ బాషా తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారి కే రామకోటయ్య, బీ శ్రీనునాయక్, రాంబాబునాయక్, జీ సునీలు, ఎం అంజి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు: ఈపూరు హైస్కూలు, ఎస్సీ ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మీసాల చిన్న ప్రసాదు, మేడికొండ దేవ సహాయం, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆయన భవిష్యత్ తరాలకు ఆదర్శనీయుడని ఎంపీడీవో హేమలతాదేవి అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఏవో శ్రీనివాస్, జీఎస్‌డబ్ల్యూఎస్ నాగిరెడ్డి, గ్రామసచివాలయ జూనియర్ అసిస్టెంట్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గణపవరం మెయిర్ రోడ్డులో ఉన్న విగ్రహానికి విశ్రాంత జీఎస్టీ కమిషనర్ బీ రాజేశ్వరరావు, దారా కిషోర్, కొండయ్య, అంబేడ్కర్ యూత్ నాయకులు నివాళులర్పించారు. కనపర్రులోని సచివాలయంలో మాల మహానాడు అధ్యక్షులు దార్ల రాయన్న ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంగం డెయిరీ సేవలు

● వ్యవసాయ శాస్త్రవేత్త సత్యనారాయణ


రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సత్యనారాయణ

పిచికలపాలెం(శావల్యాపురం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంగండెయిరీ పాలసేకరణతో పాటు రైతులకు వ్యవసాయ పరంగా అనేక సేవలను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తుందని శాస్త్రవేత్త ఆలపాటి సత్యనారాయణ అన్నారు. శావల్యాపురం మండలంలోని పిచికలపాలేనికి చెందిన రైతు పొందూరి మురళి పొలంలో సంగండెయిరీ ద్వారా రూపొందించిన అర్జున్ వరి పొలాన్ని సంగండెయిరీ అధికారులతో కలసి శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు వరిపంటను ఆశించే తెగుళ్ళు, సస్యరక్షణ చర్యలు తదితర అంశాలను గురించి వివరించారు. వినుకొండ సంగండెయిరీ మేనేజర్ ఎం జానకిరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


ఎండిన మిర్చి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేస్తున్న ఉద్యానశాఖ అధికారి

పంట మార్పిడి చేయాలి


● ఉద్యానశాఖ అధికారి నబీరసూల్

ఎఫెక్ట్

వినుకొండటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు ఒకసారి వేసిన పంటలు మళ్లీ వేయడం కారణంగానే మిర్చి పంటలు ఎండిపోవడానికి ప్రధాన కారణమని ఉద్యాన శాఖ అధికారి నబీరసూల్ శనివారం తెలి పారు. ఎండుతున్న మిర్చి అనే శీర్షికను ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉద్యాన శాఖ అధికారులు స్పందించారు. దొండపాడు, నడిగడ్డ, పాకాలు తదితర ప్రాంతాల్లో ఎండిపోయిన మిరప తోటలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ రెండు మూడు సంవత్సరాల నుంచి పంట మార్పిడి చేయకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని, భూమిలో తగినంత కార్బన్ శాతం కోసం పశువుల ఎరువును వేయకపోవడంతో మొక్కలు ఎండుతున్నా యని సూచించారు. రానున్న రోజుల్లో ప్రతి సంవత్సరం పంటల మార్పులు చేయాలని, పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా భూమిలో కార్బన్ శాతం పెంచాలని రైతులకు సూచించారు.

శరీరాన్ని, మనస్సును యోగా ప్రభావితం చేస్తుంది

● గురువు ఆతుకూరి వెంకటేశ్వరరావు


సాధకులతో యోగాకేంద్రం నిర్వహకులు కూనిశెట్టి వెంకట జనార్ధనరావు, కన్వీనర్ అనూరాధ తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మానవ శరీరాన్ని, మనస్సును యోగా ప్రభావితం చేస్తుందని యోగా ప్రధాన గురువు ఆతుకూరి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణం పట్టాభిరామస్వామి ఆలయ ప్రాంగణం లో శ్రీవెంకటేశ్వర యోగా సేవాకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన 190 ఉచిత యోగా శిక్షణ శిబిరం ముగింపు ఆనందమహోత్సవం జరి గింది. నరసరావుపేట శాఖ నిర్వహకులు కూనిశెట్టి వెంకటజనా ర్ధనరావు 28 రోజుల పాటు శిక్షణకు హాజరైన సాధకులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కన్వీనర్ కూని శెట్టి అనూరాధ, సహాయ గురువులు అడ్డగిరి రమేష్, మల్లేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం.. జ్వరాలతో సతమతం


అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ


ఆస్పత్రిలో రోగులు

ఈపూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఉన్న పారిశుధ్యంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఈపూరు మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది రాత్రి పగలు తేడా లేకుండా విజృంభిస్తున్నాయి. ప్రజలు జ్వరాలతో ఇబ్బంది పడు తున్నారు. ఊడిచర్ల ఎస్సీ కాలనీలో ఎక్కువ మంది బాధపడుతున్నారని కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి జిల్లా అధికారులు కూడా పర్యవేక్షణ జరిపారు. అయినప్పటికీ మరలా జ్వరాలు ఎక్కువయ్యాయి. కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు జ్వర పీడితులు అధికంగా వస్తున్నారని వైద్యులు తెలిపారు. దోమలు, తాగునీరు కలుషితం కావడం వల్లనే జ్వరాలు వ్యాప్తి చెందుతు న్నాయని వైద్యులు అంటున్నారు. కొండ్రముట్ల కొచ్చర్ల, ఈపూరు, అగ్ని గుండాల, ఊడిజర్ల, కూచినపల్లి, అంగలూరు, గ్రామాల్లో డ్రెయినేజీ అధ్వానంగా ఉంది. దోమల నివార ణకు పంచాయతీ వారు చర్యలు తీసుకోవాల ని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట పట్టణంలోని ఎన్‌జీవో హోమ్‌లో శనివారం జరిగిన పల్నాడు జిల్లా ఎన్‌జీవో అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. జిల్లా అధ్యక్షుడిగా మర్లపాటి రామకృష్ణ, సహా అధ్యక్షుడిగా ముత్యాల రామయ్య, ఉపాధ్యక్షుడిగా బీఆర్‌కే కుమార్, ఏ శ్రీనివాసరావు, ఈయూ అప్పారావు, కే ఆంజనేయప్రసాద్, బీ వెంకటేశ్వరరావు, వీ పద్మజ, కార్యదర్శిగా ఎం ఆనంద్‌నాథ్, కార్యనిర్వాహక కార్యదర్శి గా జీ బ్రహ్మేశరరావు, సంయుక్తకార్యదర్శిగా కేఎం హుస్సేన్, కే శ్రీనివాసరావు, ఏ సూర్యకుమార్, కోమటి శ్రీనివాసరావు, కే ప్రతాప్ కుమార్, ఎస్ శ్యామలదేవి, కోశాధికారిగా కే నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా షేక్ షరీఫ్, శ్యామసుందర శ్రీనివాస్ పరిశీలకులుగా ఎస్‌బీ రాంప్రసాద్‌లు వ్యవహరించారు.

సచివాలయ అధికారిగా ఆంజనేయప్రసాద్


నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల గ్రామసచివాలయ అధికారిగా మిట్ట ఆంజనేయప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామ పంచాయతీలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవో హోదాలో శావల్యాపురం మండలానికొచ్చారు. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను మర్యాదపూర్వకంగా కలసి నియామకపత్రాన్ని అందజేసి విధుల్లో చేరారు. ఆంజనేయప్రసాద్‌ను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు.


డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న ఎంపీడీవో పీ ఉమాదేవి

పూల, పండ్ల తోటలతో అధిక ఆదాయం

● ఎంపీడీవో ఉమాదేవి

నూజెండ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు పండ్లు, పూల తోటల పెంపకానికి ప్రోత్సాహక రాయితీలు ఇస్తున్నట్టు ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. శనివారం మండలంలోని పాత చెరుకుంపాలెం గ్రామంలో రైతులు, ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేస్తున్న గులాబీ, డ్రాగన్ ఫ్రూట్ పైర్లను ఎంపీడీవో పీ ఉమాదేవి, ఏపీవో ఆంజనేయరాజు, ఉపాధి హామీ సిబ్బంది పరిశీలించి రైతులకు ఉపాధి హామీ ద్వారా కలుగుతున్న లబ్ధిని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నూజెండ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని సీతారామపురం సమీపంలో శనివారం జరిగింది. దొనకొండ మండలం గంగవరం గ్రామానికి చెందిన ఇందూరి వెంకటరెడ్డి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా టాటా ఫోర్ వీల్ ఆటో ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా వినుకొండకు తరలించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఎన్టీఆర్ గృహాలకు దరఖాస్తులు చేయించండి

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన - ఎన్టీఆర్ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు ప్రక్రియ సోమవారంతో ముగుస్తుందని నియోజకవర్గంలోని కూటమి నాయకులు అర్హులైన వారితో దరఖాస్తులు చేయించాలని ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో ఇల్లు లేని పేదలకు సొంతిల్లు నిర్మించుకునేందుకు కూటమి ప్రభుత్వం 'అందరికీ ఇల్లు' పథకాన్ని అమలు చేసి సొంతిల్లు లేనివారికి ఇంటి స్థలం మంజూరు చేస్తుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు నివేశన స్థలాన్ని కేటాయిస్తుందని తెలిపారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.50 లక్షల వరకు ప్రభుత్వం సాయం అందిస్తుందని, అర్హులైన వారు గ్రామ సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రేషన్ కార్డు లేని వారు కూడా నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి అర్జీల స్వీకరణ

చిలకలూరిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక (గ్రీవెన్స్) నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తన కుమారుడు కాలువలో పడి చనిపోయాడని, కుటుంబ పోషణకోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నానని, ప్రభుత్వపరంగా తన కుటుంబాన్ని ఆదుకోవాలని పట్టణంలోని 10వ వార్డుకు చెందిన షేక్ అబ్దుల్ ప్రత్తిపాటికి అర్జీ ఇచ్చారు. వెంటనే ప్రత్తిపాటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటుపై పలు అర్జీలు వచ్చాయి. అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు.

ఈఫోర్‌యూ కంపెనీకి కృష్ణవేణి విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఈఫోర్‌యూ కంపెనీ ఆధ్వర్యంలో క్యాం పస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ శనివారం నిర్వహించారు. మొత్తం 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 28 మంది ఎంపికయ్యారు. రాత పరీక్ష, హెచ్‌ఆర్ రౌండ్ ద్వారా ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసిన వెంటనే ఉద్యోగంలో చేరే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు చెప్పారు. క్యాంపస్ డ్రైవ్‌ను హెచ్‌ఆర్‌లు ప్రసాద్, సుధాకర్‌లు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను టీపీవో బాలు, అధ్యాపకులు అభినందించారు.

11న ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫెస్ట్-2025


ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నజీమా తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్/డిప్లమా విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ఈశ్వర్ పాలి ఫెస్ట్-2025 నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు తెలిపారు. శనివారం కళాశాలలో ఈశ్వర్ పాలి ఫ్యూషన్ ఫెస్ట్-2025 పోస్టర్‌ను కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా ఆవిష్కరించారు. ఫెస్ట్‌లో సాంకేతిక విభాగంలో విద్యార్థులకు జంక్‌ఫుడ్ వ్యసనం అనే అంశంపై పోస్టర్ ప్రజంటేషన్, కృత్రిమ మేదస్సు ఒక వరం లేదా శాపం అనే అంశాలపై పేపర్ ప్రజంటేషన్ పోటీలు, జనరల్ క్విజ్ ఉంటాయి. సాంస్కృతిక విభాగంలో సోలో డాన్స్, గ్రూప్ డాన్స్‌లు ఉంటాయి. బాలురకు చెస్, కారమ్స్, రన్నింగ్, వాలీబాల్, కబడ్డీ, బాలికలకు కారమ్స్ టెన్నికాయిట్, రన్నింగ్, ఖో-ఖో ఉంటాయని తెలిపారు.

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025కు ఎన్ఈసీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటేశ్వరరావు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025కు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. శనివారం కళాశాలలో హ్యాకదాన్ 2025కు ఎంపికైన విద్యార్థులు జి.షణ్ముక, టి.నాగ కల్యాణ్, కె.హర్షిత, కేవీ సాయి భారతి, జి.చిన్మయి, కె.తన్మయి, విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్‌బాబు అభినందించారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ప్రధానోపాధ్యాయిని జ్యోతిర్మయి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయిని జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని కట్టుబడివారిపాలెం మండల ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన స్వచ్ఛ సేవ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు పుస్తకాలు, కాపీ రైటింగు పుస్తకాలు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మేడం నాగరాజు, సిందుకూరి అంకమ్మరావు, మజ్జిగ శ్రీనివాసరావు, పగడాల రామాంజనేయులు, వీరేంద్రనాద్, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు, దాతలు